సాక్షి ఆదిలాబాద్

శుక్రవారం । 17 । అక్టోబర్ । 2025

I



విప్లవోద్యమం ఇక చరిత్రే! IIలో▸

విప్లవోద్యమ చరిత్రలో ఉమ్మడి ఆదిలాబాద్‌కు ఎంతో ప్రత్యేకత ఉంది. ఎందరో యువతీయువకులు దశాబ్దాల క్రితం అడవిబాట పట్టారు.



జాడలేని కొనుగోలు కేంద్రాలు

మొక్కజొన్న పంట చేతికి అందినా ఫలితం లేకుండా పోయింది. రైతులు పంటను విక్రయిద్దామంటే ఇప్పటివరకు జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదు. IIIలో▸

గరిష్టం/కనిష్టం
33.0/23.0

వాతావరణం

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణం పొడిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

బాధ్యతలు స్వీకరించిన డీపీఆర్వో



కలెక్టర్‌కు మొక్క ఇస్తున్న విష్ణువర్ధన్

కైలాస్‌నగర్: ఇన్‌చార్జి డీపీఆర్వోగా ఎల్చల విష్ణువర్ధన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న తిరుమలను కామారెడ్డికి బదిలీ చేయగా, నిర్మల్ డీపీఆర్వోగా పనిచేస్తున్న విష్ణువర్ధన్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సమాచారశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు బాధ్యతలు స్వీకరించిన ఆయన కలెక్టర్ రాజర్షి షాను క్యాంపు కార్యాలయంలో కలిసి పూలమొక్క అందజేశారు.

రిమ్స్ ప్రొఫెసర్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ రమ

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ ఆస్పత్రి ప్రొఫెసర్ అశోక్, ఆయన సతీమణి గైనకాలజిస్ట్ రమకు హెల్త్‌కేర్ లెజెండ్ అవార్డు దక్కింది. గురువారం హైదరాబాద్‌లోని నోవోటెల్ హోటల్‌లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మాజీ మంత్రి హరీశ్‌రావు అవార్డు అందజేశారు. జిల్లాలో 30 ఏళ్లుగా రోగులకు సేవలందించగా హైబిజ్ సంస్థ ఆధ్వర్యంలో వీరిని సన్మానించి జ్ఞాపిక అందజేశారు.

పశువైద్య శిబిరం పరిశీలన



పశువైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న రామారావు

ఇచ్చోడ: మండలంలోని గుబ్బ గ్రామంలో గురువారం నిర్వహించిన పశువైద్య శిబిరాన్ని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి రామారావు పరిశీలించారు. ఉచిత గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. పశువైద్య శిబిరాల్లో పశువులన్నింటికీ తప్పనిసరిగా గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని, ఆధార్ చెవి పోగు కూడా వేయించాలని పేర్కొన్నారు. రైతులు పశుపోషణపైనా దృష్టి సారించాలని సూచించారు. అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న దండారీ వేడుకల్లో పాల్గొన్నారు. మండల పశువైద్యాధికారి గోవింద్‌నాయక్, సంధ్య ఉన్నారు.

విద్యార్థినులకు చెక్కుల పంపిణీ

కైలాస్‌నగర్: బాలికాసాధికారత, బాలల హక్కుల పరిరక్షణకు పనిచేస్తున్న మహిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించగా కలెక్టర్ రాజర్షి షా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రుతుక్రమ పరిశుభ్రత నిర్వహణపై ముద్రించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆదిలాబాద్ అర్బన్, ఆదిలాబాద్ రూరల్, తాంసి, భీంపూర్ మండలాల్లోని 25 పాఠశాలలకు చెందిన 50మంది విద్యార్థినులకు రూ.5వేల చొప్పున రూ.2.50లక్షల స్కాలర్‌షిప్ చెక్కులు అందజేశారు. అడిషనల్ కలెక్టర్ రాజేశ్వర్, స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ డేవిడ్ రాజు, జిల్లా సంక్షేమాధికారి మిల్కా, మహిత స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ రమేశ్ శేఖర్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, విద్యాశాఖ సీఎంవో తిరుపతి, సెక్టోరియల్ అధికారి రఘురమణ పాల్గొన్నారు.

విద్యార్థులకు అపార్ ఐడీ తప్పనిసరి

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులకు అవసరమైన ఆధార్, రెసిడెన్స్ సర్టిఫికెట్లు ఒకేచోట అందించేలా చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. జిల్లా కేంద్రంలోని గెజిటెడ్–1 పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ ఎంబీయూ కేంద్రాన్ని పరిశీలించారు. ఆధార్ నమోదు, మార్పులు, మీసేవ కేంద్రాల ద్వారా అందించే సర్టిఫికెట్ల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు అపార్ ఐడీ కోసం ఆధార్ తప్పనిసరి అని పేర్కొన్నారు. ప్రయోగాత్మకంగా ఆదిలాబాద్‌అర్బన్, రూరల్, మావల మండలాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఆదిలాబాద్ అర్బన్ ఎంఈవో సోమయ్య, ప్రధానోపాధ్యాయురాలు నీలాదేవి, ఈడీఎం రవి ఉన్నారు.

మియాపూర్‌కు స్పెషల్ బస్సు

ఆదిలాబాద్: ఆదిలాబాద్ డిపో నుంచి హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ కాలనీ మీదుగా మియాపూర్‌కు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు నడపనున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. రోజూ ఉదయం 10.50, రాత్రి 9.45 గంటలకు ఆదిలాబాద్ నుంచి బయలుదేరుతుందని తెలిపారు. మియాపూర్ నుంచి రోజూ ఉదయం 11.15, రాత్రి 9గంటలకు బయలుదేరుతుందని వివరించారు. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'గిరి' గ్రామాల్లో దండారీ



ఝరిపూనగూడ ఆదివాసీలకు స్వాగతం పలుకుతున్న గిరిగాం గ్రామస్తులు

'గిరి' గ్రామాల్లో దండారీ సంబురాలు జోరుగా సాగుతున్నాయి. గురువారం తాంసి మండలం గిరిగాం గ్రామానికి తలమడుగు మండలం ఝరిపూనగూడ ఆదివాసీలు భేటీకి రాగా గ్రామస్తులు సంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికారు. అనంతరం పటేల్ ఇంటి వద్ద పూజలు నిర్వహించి గుస్సాడీ నృత్యం చేసి అలరించారు. ఈ సందర్భంగా సామూహిక అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఝరిపూనగూడ గిరిజనులకు వీడ్కోలు పలికారు.

– తాంసి



సంప్రదాయ వేషధారణలో ఆదివాసీలు



గుస్సాడీ నృత్యం చేస్తున్న ఆదివాసీలు

కదిలినా.. వదలరు!



జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కార్యాలయం

- వైద్యశాఖలో డిప్యూటేషన్ల పర్వం
- ఇష్టారీతిగా విధుల కేటాయింపు
- ఏజెన్సీ అలవెన్స్ కాజేస్తున్న వైనం
- వైద్యాధికారులు, ఉద్యోగుల తీరుపై డిపార్ట్‌మెంట్‌లోనే తీవ్ర విమర్శలు

ఆదిలాబాద్‌టౌన్: వైద్యారోగ్యశాఖలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు, వైద్యాధికారుల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు, రాజకీయ నాయకుల అండదండలతో వారికి నచ్చినచోటే విధులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో 'సాక్షి'లో ప్రచురితమైన 'అక్రమ డిప్యూటేషన్లు' కథనానికి ఆ శాఖ అధికారులు స్పందించి డిప్యూటేషన్లను రద్దు చేసిన విషయం విదితమే. ఆ తర్వాత పైరవీలతో వారు మళ్లీ తెరకెక్కారు. ఎన్ని విమర్శలు ఎదుర్కొంటున్నా వారి తీరు మారడం లేదు. వారికి అనుకూలంగా నచ్చినచోటే పనిచేస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేయాల్సిన ఉద్యోగులు మైదాన ప్రాంతాల్లో పనిచేస్తూ ఏజెన్సీ అలవెన్స్‌లు పొందుతున్నారు. జిల్లా ఉన్నతాధికారుల అనుమతితో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నామని సదరు ఉద్యోగులు పేర్కొనడం గమనార్హం.

చాలామందికి అక్రమ డిప్యూటేషన్లు!

కొందరు ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. సైద్‌పూర్‌లో ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్లు పనిచేయాల్సి ఉండగా, ఒకరు డిప్యూటేషన్‌పై ఉన్నారు. సదరు ఉద్యోగి ఇప్పటికే పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డిప్యూటేషన్లపై పనిచేయడం విస్మయానికి గురిచేస్తోంది. సైద్‌పూర్‌లో పనిచేసే ఉద్యోగి గతంలో గిమ్మ పీహెచ్‌సీతో పాటు రిమ్స్‌లోని మలేరియా విభాగంలో పనిచేశారు. డిప్యూటేషన్ రద్దు కాగా, ఆ తర్వాత సైద్‌పూర్‌కు తిరిగి వెళ్లారు. కొన్నిరోజులే అక్కడ పనిచేసి మళ్లీ ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌కు డిప్యూటేషన్‌పై వచ్చారు. ఇటీవల మళ్లీ రిమ్స్‌లోని మలేరియా విభాగంలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఎలాంటి ఉత్తర్వులు లేకుండానే సదరు ఉద్యోగి నచ్చిన చోట పనిచేస్తారనే ఆరోపణలున్నాయి. సైద్‌పూర్‌లో పనిచేసే మరో ల్యాబ్ టెక్నీషియన్ డిప్యూటేషన్ కోసం పలుసార్లు ఆ శాఖ అధికారులకు నివేదించినా సదరు ఉద్యోగికే డిప్యూటేషన్ ఇవ్వడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. కాగా, గాదిగూడలో పనిచేసే ల్యాబ్ టెక్నీషియన్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆవరణలోని టీబీ ఆస్పత్రిలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహించారు. ఆ తర్వాత డిప్యూటేషన్ రద్దు చేయగా మళ్లీ కొన్నిరోజులకే టీబీ ఆస్పత్రికి డిప్యూటేషన్‌పై వచ్చారు. ఝరి పీహెచ్‌సీలో పనిచేసే ఓ ఉద్యోగి రిమ్స్ ఆస్పత్రిలోని ఎన్‌సీడీ విభాగంలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నారు. సొనాలలోని పీహెచ్‌సీలో పనిచేసే ఓ ఉద్యోగి ఖుర్షీద్‌నగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. రిమ్స్ ఆస్పత్రిలో పనిచేసే ఓ ఉద్యోగి శాంతినగర్ పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. శ్యాంపూర్‌లోని పీహెచ్‌సీలో హెల్త్ ఎడ్యుకేటర్‌గా పనిచేసే ఓ ఉద్యోగి డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయంలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నారు. ఇచ్చోడలో పనిచేసే ఓ ఉద్యోగి డీఎంహెచ్‌వో కార్యాలయంలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. నర్సాపూర్(టీ)లో పనిచేసే ఓ వైద్యుడు అంకోలి పీహెచ్‌సీలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ ఇద్దరు వైద్యులున్నారు. బజార్‌హత్నూర్ పీహెచ్‌సీలో పనిచేసే మెడికల్ ఆఫీసర్ తాంసిలో డిప్యూటేషన్‌పై ఉన్నారు. ఇలా చాలామంది అక్రమ డిప్యూటేషన్లలో కొనసాగుతున్నారు.

ఏజెన్సీ అలవెన్స్‌లు పొందుతూ..

జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేసే ఉద్యోగులకు ప్రభుత్వం అదనంగా ఏజెన్సీ అలవెన్స్‌లు చెల్లిస్తోంది. అయితే నిబంధనలకు విరుద్ధంగా కొందరు ఉద్యోగులు మైదాన ప్రాంతాల్లో డిప్యూటేషన్‌పై పనిచేస్తూ ఏజెన్సీ అలవెన్స్‌లు కాజేస్తున్నారు. వీరిపై చర్యలు తీసుకోవాలని ఆ శాఖ ఉద్యోగులే కోరుతుండడం గమనార్హం. వారికి కేటాయించిన స్థానాల్లో పనిచేయకుండా యూనియన్ నాయకులు, రాజకీయ నేతల ద్వారా అధికారులపై ఒత్తిడి తెప్పించి వారికి నచ్చినచోట డిప్యూటేషన్ వేయించుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. ఈ విషయమై జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి నరేందర్ రాథోడ్‌ను వివరణ కోరగా, కొందరు ఉద్యోగులకు అవసరమున్న చోట డిప్యూటేషన్‌పై విధులు కేటాయించినట్లు తెలిపారు. ఆస్పత్రులకు వచ్చే రోగులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

క్రాప్ బుకింగ్ పూర్తయ్యాకే కొనుగోళ్లు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా, వేదికపై ఎస్పీ అఖిల్ మహాజన్, ఎమ్మెల్యేలు


- సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లు
- కలెక్టర్ రాజర్షి షా
- కలెక్టరేట్‌లో పత్తి కొనుగోళ్లపై సమీక్ష
- కిసాన్ యాప్ పోస్టర్ ఆవిష్కరణ

కైలాస్‌నగర్: జిల్లాలో డిజిటల్ క్రాప్ బుకింగ్ 85 శాతం పూర్తయిందని, వందశాతం పూర్తయ్యాక రైతుల సమాచారమంతా కపాస్ కిసాన్ యాప్‌లోకి వెళ్లాకే పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తామని కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. ఈ ప్రక్రియ ఈ నెలాఖరుకు పూర్తికానుందని తెలిపారు. పత్తి కొనుగోళ్లపై గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు, వ్యాపారులు, వ్యవసాయ, మార్కెటింగ్, పోలీస్, ఫైర్, లీగల్ మెట్రాలజీ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. తొలుత ఆయా వర్గాల నుంచి అభిప్రాయలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. పత్తి కొనుగోళ్లు సజావుగా సాగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. నెట్‌వర్క్ సమస్య కలిగిన ఆవాస ప్రాంతాలను పెన్షన్ పంపిణీలో తలెత్తిన ఇబ్బందుల ఆధారంగా గుర్తించి వాటి వివరాలు సేకరించామని, ఈ ప్రాంతాల్లో ఏఈవోల ద్వారా స్లాట్‌బుకింగ్ చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నెట్‌వర్క్ కలిగిన ప్రాంతాల్లో రైతులకు సహకరిస్తూ స్లాట్ బుకింగ్ చేసేందుకు ఆసక్తి గల యువతను గుర్తించి వారి సెల్ నంబర్లనూ తీసుకున్నామని పేర్కొన్నారు. అక్కడ నెట్‌వర్క్ ఉంటుందా? లేదా? అనే వివరాలు కూడా సేకరించామని తెలిపారు. యువత, ఏఈవోలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కౌలు రైతులు మాత్రం రిజిస్ట్రేషన్‌తో పాటు స్లాట్ బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. తేమశాతంపై ఇబ్బందులు తలెత్తకుండా కాటన్ పర్చేజింగ్ ఆఫీసర్లు (సీపీవోలు), ఐకేపీ సిబ్బందిని నియమించుకోవాలని సూచించారు. ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా కంట్రోల్ రూంలు ఏర్పాటు చేస్తామని కలెక్టర్ చెప్పారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా షామియానాలు, కుర్చీలు, తాగునీటి వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. సమస్యలు తలెత్తకుండా తహసీల్దార్, ఎస్‌హెచ్‌వో, ఇద్దరు రైతులతో కూడిన ప్రత్యేక పర్యవేక్షణ కమిటీలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. వారు జిన్నింగ్‌లు, కొనుగోలు కేంద్రాలను సందర్శించి వసతులు పరిశీలించాలని ఆదేశించారు. అనంతరం కిసాన్ యాప్ ప్రచార పోస్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో సబ్ కలెక్టర్ యువరాజ్, ట్రైనీ కలెక్టర్ సలోని, అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, అనిల్ జాదవ్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నర్సయ్య, మార్కెటింగ్ ఏడీ గజానంద్, ఆర్డీవో స్రవంతి, వ్యవసాయ శాఖ టెక్నికల్ అధికారి కే శివకుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్లు, సెక్రటరీలు పాల్గొన్నారు.

పోలీస్ పికెటింగ్ ఏర్పాటు

ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ.. మార్కెట్ యార్డులో ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రతీ జిన్నింగ్ మిల్లులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, తహసీల్దార్, సెక్రటరీ, ఎస్‌హెచ్‌వో, రైతులతో కూడిన మానిటరింగ్ కమిటీలకు పత్తి కొనుగోళ్లపై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలిగించవద్దని, కొనుగోళ్లలో ఎలాంటి అవకతవకలు జరిగినా వెంటనే ఫిర్యాదు చేస్తే తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సీసీఐ ద్వారానే కొనాలి



అధికవర్షాలతో రైతుల ఇబ్బందులు రెట్టింపయ్యాయి. వారిని ఆదుకునేలా సీసీఐ ద్వారానే పత్తి కొనుగోలు చేయాలి. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కపాస్ కిసాన్ యాప్ గురించి రైతులకు అవగాహన కల్పించాలి. మహారాష్ట్ర నుంచి తెచ్చిన జొన్నలు విక్రయించడం ద్వారా జిల్లాకు, అధికారులకు చెడ్డపేరు వచ్చింది. పత్తి కొనుగోళ్లలో అలాంటి పరిస్థితి లేకుండా చూడాలి. రైతులకు ఇబ్బందులు లేకుండా మార్కెట్ యార్డులో వసతులు కల్పించాలి.

– పాయల్ శంకర్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే

తేమశాతంపై సడలింపు ఇవ్వాలి



జిల్లాలో నెట్‌వర్క్‌లేని మారుమూల గ్రామాల్లో స్లాట్ బుకింగ్‌కు రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విధానం సాధ్యమయ్యే పరిస్థితి లేదు. పంట విక్రయాలను జిల్లాకు పరిమితం చేయకుండా రైతులు తమకు సమీప జిల్లాల్లో అమ్ముకునే అవకాశం కల్పించాలి. తేమశాతాన్ని 12కు పరిమితం చేయకుండా సడలింపునిచ్చి న్యాయం చేయాలి. కొనుగోళ్లు సాఫీగా సాగేలా, పంట విక్రయించిన రైతులకు మూడు రోజుల్లో డబ్బులు అందేలా చర్యలు చేపట్టాలి.

– అనిల్‌జాదవ్, బోథ్ ఎమ్మెల్యే

సర్వేయర్లు వస్తున్నారు

- 45మంది అభ్యర్థుల ఉత్తీర్ణత
- సిద్ధమవుతున్న లైసెన్స్‌లు
- 19న అందించనున్న సీఎం

కైలాస్‌నగర్: లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకాలకు రంగం సిద్ధమవుతోంది. తొలి విడత శిక్షణ పూర్తి చేసుకుని అన్ని పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారిని నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి కసరత్తు పూర్తి చేయాలని జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారులను ఆదేశించింది. దీంతో అధికారులు జిల్లాకు సంబంధించిన 45మంది లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామక ప్రక్రియ ప్రారంభించారు. గురువారం అభ్యర్థుల పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్‌కార్డు, ఎస్సెస్సీ మెమోలు స్వీకరించారు. వాటి ఆధారంగా లైసెన్స్ పత్రాలు సిద్ధం చేశారు. ఈ నెల 19న హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో జరిగే కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా అందించనున్నట్లు తెలుస్తోంది.

జిల్లాలో 45మంది అర్హులు

జిల్లాలో మొదటి విడత శిక్షణ కోసం 155 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి గత మే 26నుంచి జూలై 26వ తేదీ వరకు శిక్షణ ఇచ్చారు. జేఎన్టీయూ ఆధ్వర్యంలో రాత, ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించారు. తొలి విడత పరీక్షలో నలుగురే ఉత్తీర్ణత సాధించగా, సప్లిమెంటరీ పరీక్షల్లో మరో 41మంది పాసయ్యారు. వీరికి 40రోజుల పాటు మండల సర్వేయర్ల కింద అప్రెంటిస్‌షిప్ ఇచ్చారు. ఈ శిక్షణ పూర్తి కాగా గత నెల 27న వీరికి అసెస్‌మెంట్ పరీక్ష నిర్వహించారు. ఇందులోనూ ఉత్తీర్ణత సాధించిన వారికి సర్వేయర్ లైసెన్స్‌లు అందించాలని నిర్ణయించారు. జీపీవోల తరహాలో వీరిని కూడా రెవెన్యూ క్లస్టర్ల వారీగా నియమించనున్నట్లు తెలుస్తోంది.



లైసెన్స్‌లు సిద్ధం చేస్తున్న అధికారులు

హైదరాబాద్‌లో సీఎం చేతుల మీదుగా..

ఆ శాఖ రాష్ట్ర కమిషనర్ నుంచి వచ్చిన ప్రొఫార్మా ప్రకారం అభ్యర్థుల వివరాలతో కూడిన లైసెన్స్‌లు రూపొందించారు. అభ్యర్థులను హైదరాబాద్‌కు తీసుకెళ్లి సీఎం చేతుల మీదుగా పత్రాలు అందించనున్నట్లు జిల్లా సర్వేల్యాండ్ రికార్డ్స్ ఏడీ రాజేందర్ తెలిపారు. వీరి నియామకం ద్వారా జిల్లాలో సర్వేయర్ల కొరత తగ్గి భూముల కొలతల ప్రక్రియ వేగవంతమయ్యే అవకాశముంటుందని పేర్కొన్నారు.

ఫ్లాగ్ డే వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: పోలీస్ అమరవీరుల సంస్మరణలో భాగంగా ఈ నెల 21న ఫ్లాగ్ డే వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ ఓ ప్రకటనలో తెలిపారు. పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో అమరవీరుల స్తూపం వద్ద కలెక్టర్, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు నివాళులర్పిస్తారని పేర్కొన్నారు. అమరవీరుల కుటుంబ సభ్యులకు బహుమతులు అందజేస్తారని తెలిపారు. 22న జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఓపెన్‌హౌస్ కార్యక్రమంలో భాగంగా 23న విద్యార్థులకు పోలీసులు వినియోగించే ఆయుధాలు, అత్యవసర పరిస్థితుల్లో తీసుకునే చర్యలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. అదేరోజు సాయంత్రం అమరవీరులను స్మరించి పట్టణంలో సైకిల్ ర్యాలీ, ప్రధాన కూడళ్ల వద్ద అమరవీరుల చిత్రపటాల ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. పోలీసుల సేవలు, రోడ్డు ప్రమాదాలు, కమ్యూనిటీ పోలీసింగ్, ఇతర సామాజిక అంశాలపై విద్యార్థులు, యువకులు ఫొటోలు, మూడు నిమిషాల వీడియోలు అందించాలని, ఉత్తమంగా ఉన్న వాటిని ఎంపిక చేసి జిల్లా స్థాయిలో బహుమతులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో 'రోల్ ఆఫ్ పోలీస్ ప్రివెన్షన్ అండ్ హౌ స్టూడెంట్స్ కెన్ స్టే అవే ఫ్రం డ్రగ్స్' అంశంపై 500 పదాల్లో వ్యాసాలు అందించాలని సూచించారు. 24న 2వేల మంది విద్యార్థులతో ఆదిలాబాద్‌లో 5కే రన్ నిర్వహించనున్నట్లు వివరించారు.

'వర్షాధారిత సమగ్ర అభివృద్ధి'పై అవగాహన

బేల: మండలంలోని సోన్‌కాస్ గ్రామంలో జిల్లా ఉద్యానశాఖ ఆధ్వర్యంలో గురువారం వర్షాధారిత సమగ్ర అభివృద్ధి పథకంపై అవగాహన కల్పించారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి నర్సయ్య మాట్లాడుతూ.. ఈ పథకం కింద కూరగాయలు సాగుచేస్తూ పశువులు, ఆగ్రోఫారెస్ట్రీ మొక్కలు కలిగిన రైతులను ఒక క్లస్టర్ పరిధిలో 110మందిని ఎంపిక చేశామని తెలిపారు. ఇందులో భాగంగా ఒక్కో రైతుకు రూ.30వేల లాభం సబ్సిడీ రూపంలో అందుతుందని పేర్కొన్నారు. కూరగాయల విత్తనాల కోసం రూ.10వేలు, ప్లాస్టిక్ క్రేట్, వర్మీ కంపోస్ట్ బెడ్ కోసం రూ.10వేలు, రూ.10వేల విలువైన రెండు తేనేటీగల బాక్సులు అందించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయిల్‌పాం సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. మండల ఉద్యాన అధికారి అలేఖ్య, ఉద్యాన విస్తరణ అధికారులు సతీశ్, మహేందర్, ప్రీయునిక్ ఏరియా మేనేజర్ నవీన్, ఫీల్డ్ అఫీసర్ జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

గుండాల అటవీప్రాంతంలో దాడులు

- రూ 90వేల విలువైన కలప పట్టివేత

సాక్షి ఎఫెక్ట్..

ఇచ్చోడ: 'అడవి తల్లి కన్నీరు' శీర్షికన ఈ నెల 14న 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి అటవీ అధికారులు స్పందించారు. ఇన్‌చార్జి డీఎఫ్‌వో రేవంత్‌చంద్ర ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్, స్థానిక అటవీశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం మండలంలోని గుండాల అటవీప్రాంతలో సోదాలు నిర్వహించారు. దట్టమైన అటవీప్రాంతంలో టేకు చెట్లను నరికిన కొందరు స్మగ్లరు వాటిని సైజులుగా మార్చి విక్రయించేందుకు సిద్ధం చేయగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న కలప విలువ రూ.90వేల వరకు ఉంటుంది. కాగా, అటవీశాఖ అధికారులు ఘటనాస్థలానికి చేరుకునే లోపే స్మగ్లర్లు పరారయ్యారు. పట్టుకున్న కలపను ఇచ్చోడ టింబర్ డిపోకు తరలించారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఎఫ్ఆర్వో శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్వోలు అమర్‌సింగ్, కవిత, ఎఫ్‌బీవోలు సజన్‌లాల్, భీంజీనాయక్, రాకేశ్, స్వాతి, బేస్‌క్యాంప్ సిబ్బంది, పోలీసులు ఉన్నారు.



స్వాధీనం చేసుకున్న కలపతో అధికారులు

వైన్స్‌షాపులకు 60 దరఖాస్తులు

ఆదిలాబాద్‌టౌన్: ఇప్పటివరకు మందకొడిగా సాగిన వైన్స్‌షాపుల దరఖాస్తుల ప్రక్రియ రెండురోజులుగా ఊపందుకుంది. గురువారం జిల్లాలోని 40 మద్యం దుకాణాలకు 60 దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి హిమశ్రీ, ఆదిలాబాద్ ఎక్సైజ్ సీఐ విజేందర్ తెలిపారు. ఇప్పటివరకు ఆదిలాబాద్, ఇచ్చోడ, ఉట్నూర్ స్టేషన్‌లకు కలిపి 170 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. గురువారం ఆదిలాబాద్ స్టేషన్ పరిధిలో 34, ఇచ్చోడ పరిధిలో 19, ఉట్నూర్ పరిధిలో ఏడు దరఖాస్తులు వచ్చాయి.



దరఖాస్తులు స్వీకరిస్తున్న హిమశ్రీ

క్లుప్తంగా

స్వగ్రామం చేరిన మృతదేహం

సర్సాపూర్(జి): ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశం దుబా య్ వెళ్లిన మండలంలోని తిమ్మాపూర్ (జి) గ్రా మానికి చెందిన గోపు భూ మయ్య (42) నెల రోజు ల క్రితం గుండెపోటుతో మృ తి చెందగా గురువా రం మృతదేహం స్వగ్రా మానికి చేరింది. గ్రామానికి చెందిన గోపు భూమయ్య దుబాయ్‌లోని సోనా పూర్ ప్రాం తంలో గల సీఆర్‌సీ కంపెనీలో ఏడాదిన్నరగా కార్మికుడిగా పనిచేస్తున్నాడు. నెలరోజుల క్రి తం గుండెపోటుతో మృతి చెందగా యూఏఈ హె ల్పింగ్ ఆర్గనైజేషన్ సంస్థ సహకారంతో బొమ్మ ప్రవీ ణ్, బొడ్డుపల్లి రాము, గన్నారపు హన్మాండ్లు, శ్రీనివాస్ కంపెనీ యాజమాన్యం, పీఆర్వోలతో మాట్లాడి మృతదేహాన్ని స్వగ్రా మానికి పంపించే ఏర్పా ట్లు చేశారు. గురు వారం స్వగ్రామానికి మృతదేహం చేరడంతో బాధిత కుటుంబ సభ్యులు, బంధువుల రోదన లు మిన్నంటాయి. మృతునికి భార్య, కుమా రుడు, కూతురు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ఇచ్చోడ: మండలంలోని అటవీ ప్రాంతం నుం చి అక్రమంగా ఇసుకు తరలిస్తున్న మూడు ట్రా క్టర్లను అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో కొంతమంది ట్రాక్టర్ యజమానులు ఇసుకను తరలించి మండల కేంద్రంలో విక్రయిస్తున్నట్లు తెలిసింది. అటవీ శాఖ అధికారి పుండలిక్ రెండు రోజుల క్రితం ట్రాక్టర్‌ను పట్టుకోగా గురువారం టైగర్‌జోన్ అధికారులు మరో మూడు ట్రాక్టర్లను పట్టుకు న్నారు. ఈ మేరకే కేసులు నమోదు చేసి ట్రాక్ట ర్లను సీజ్ చేశారు.

బాలిక అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: తలమడుగు మండలంలోని దహెగాంలో అత్తాగారి ఊర్లో నివాసం ఉం టున్న మహారాష్ట్రకు చెందిన ఆకాష్ కూతురు అదృశ్యమైనట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఈ నెల 13న భార్యభర్తలు కూలీ పనులకు వెళ్లగా కూతురు కనిపించకుండా పోయింది. చుట్టుపక్కల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కేసును తలమడుగు పోలీసు స్టేషన్‌కు బదిలీ చేయను న్నట్లు వివరించారు.

విప్లవోద్యమం ఇక చరిత్రే!

- ఇప్పటికే ఎంతోమంది ఎన్‌కౌంటర్
- మరికొందరు లొంగుబాటు..
- మావోల శకం ముగిసినట్లే..?

బెల్లంపల్లి: పూర్వ పీపుల్స్‌వార్ ప్రస్తుత మావోయి స్టుపార్టీ విప్లవోద్యమ చరిత్రలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ఎంతో ప్రత్యేకత ఉంది. విప్లవ పంథాకు ఆకర్షితులైన ఎందరో యువతీ, యువకు లు సమసమాజ స్థాపన కోసం నాలుగున్నర దశా బ్దాల క్రితం అడవి బాట పట్టారు. సాయుధ పోరాటం ద్వారానే రాజ్యాధికారం సాధ్యమని దృ ఢంగా నమ్మి తల్లిదండ్రులు, తోబుట్టువులను వదిలి విప్లవమార్గం అనుసరించారు. నిరుపేద, కార్మిక, కర్షక కుటుంబాల నుంచి విద్యావంతులు, యువకు లు ప్రాణత్యాగాలకు వెరవకుండా తుపాకి పోరాటంలో భాగస్వాములయ్యారు. అడవుల జిల్లా నలుమూలల పోరాట బీజాలు నాటి ఒకానొక దశలో సమాంతరంగా కార్యకలాపాలు సాగిం చారు. మందుపాతరలు పేల్చి పోలీసులను హత మార్చారు. కరువు దాడులు చేశారు. పోలీస్‌స్టేషన్ లను టార్గెట్‌గా చేసి ఆయుధాల అపహరణకు సిద్ధ పడ్డారు. నక్సలైట్‌ల ఏరివేతలో భాగంగా పోలీసు లు జరిపిన ఎదురు కాల్పుల్లో ఎందరో అసువులు బాశారు. పచ్చటి అడవులు నెత్తుటేరులతో ఎరు పెక్కాయి. 1980 దశకం నుంచి 1995 వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విప్లవ జ్వాలలు ఉవ్వెత్తున ఎగిసిపడ్డాయి. ఆతర్వాత పోలీసులు వ్యూహాత్మకం గా పట్టుసాధించి పదుల సంఖ్యలో నక్సలైట్లను ఎన్ కౌంటర్‌లలో హతమార్చారు.

జగిత్యాల జైత్రయాత్ర వెల్లువలో...

పీపుల్స్‌వార్ వ్యవస్థాపక ఆద్యుల్లో ముఖ్యుడైన కొం డపల్లి సీతారామయ్య సారథ్యంలో జగిత్యాల జైత్ర యాత్ర జరిగింది. ఆ పరిణామాల క్రమంలో 1978–79 ప్రాంతంలో బెల్లంపల్లికి చెందిన గజ్జెల గంగారాం, పెద్ది శంకర్, 1980, 81ప్రాంతంలో కటకం సుదర్శన్ విప్లవ భావజాలానికి ఆకర్షితులై అమరుడు నల్లా ఆదిరెడ్డి మార్గదర్శకంలో పీపుల్స్ వార్ గ్రూప్‌ను విస్తరించారు. వీరి నేతృత్వంలో విప్లవ కార్యకలాపాలు ముమ్మరంగా సాగాయి. అడవుల జిల్లా అంతటా పీపుల్స్‌వార్ వేళ్లానుకుని బలీయమైన శక్తిగా రూపాంతరం చెందింది. విప్లవ పోరాటాన్ని తీవ్రతరం చేయడంలో బెల్లంపల్లి, మం దమర్రి, చెన్నూర్, ఆసిఫాబాద్, నిర్మల్, బోథ్, ఆదిలాబాద్, సిర్పూర్, తదితర ప్రాంతాలకు చెం దిన ఎందరో కీలక భూమిక పోషించారు.

అమరత్వం... లొంగుబాటు...

విప్లవోద్యమంలో బెల్లంపల్లికి చెందిన పెద్ది శంకర్, గజ్జెల గంగారాం తొలి అమరులుగా చరిత్ర కెక్కా రు. మొన్నటి జాడి వెంకటి వరకు విప్లవ ఆశయం సిద్ధించకుండానే నెత్తుటి బాటలో అనేకమంది నేల రాలారు. వ్యక్తిగత బలహీనతలు, అనారోగ్య సమ స్యలు, పోలీసు నిర్బంధాన్ని తట్టుకోలేక వందలాది మంది జనజీవన స్రవంతిలో కలిశారు. పక్షం రో జుల క్రితం దండకారణ్యంలో పనిచేస్తున్న చెన్నూర్ ప్రాంతానికి చెందిన మావోయిస్టు దంపతులు ఆత్రం లచ్చయ్య, పద్మ పోలీసుల ఎదుట లొంగి పోయారు. తాజాగా దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ (డీకేఎస్‌జెడ్‌సీ) సెక్రెటరీగా పనిచేసిన బెల్లం పల్లికి చెందిన సలాకుల సరోజ ఉరఫ్ లత ఉరఫ్ దీప, ఆమె భర్త నిర్మల్ జిల్లా కూచన్‌పల్లి వాసి దండ కారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ ఇన్‌చార్జి ఇర్రి. మోహన్‌రెడ్డి ఉరఫ్ వివేక్ గడ్చిరోలిలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర పడ్నవీస్‌కు ఆయుధాన్ని అప్పగించి విప్లవ జీవితానికి ముగింపు పలికారు. వీరి లొంగుబాటు నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో మావోయిస్టుల ప్రభావం దాదాపు కనుమరుగై పోయినట్లేనని చర్చించుకుంటున్నారు.

అజ్ఞాతంలో ఉన్నది ఇంకెందరు?

సరోజ, మోహన్‌రెడ్డి దంపతుల లొంగుబాటు అనంతరం మావోయిస్టు పార్టీ విప్లవోద్యమంలో ప్రస్తుతం అజ్ఞాతంలో ఎందరున్నారనే చర్చ జరుగుతోంది. దండకారణ్యం కేంద్రంగా పని చేస్తున్న మావోయిస్టుపార్టీ ముఖ్య నాయకుడు, సింగరేణి కార్మిక సమాఖ్య (సికాస) కార్యదర్శిగా వ్యవహరిస్తున్న మందమర్రికి చెందిన బండి ప్రకాష్ (ఇతను కూడా ప్రభుత్వానికి లొంగి పోతారనే ప్రచారం జరుగుతోంది), మరో మావోయిస్టు అగ్రనాయకుడు కోటపల్లి మండ లం బబ్బెర చెలక గ్రామవాసి మూల దేవేందర్ రెడ్డి, బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి గ్రామానికి చెందిన జాడి పుష్ప, బెల్లంపల్లి శాంతిఖని బస్తీకి చెందిన కృష్ణ, మరో యువకుడితో పాటు మరి కొంతమంది విప్లవ కార్యకలాపాలు సాగిస్తు న్నట్లు తెలుస్తోంది. వీరు మినహా ఉమ్మడి జిల్లా లో మరెవరూ అజ్ఞాతంలో లేనట్లుగా మాజీ మావోయిస్టులు, విప్లవ సానుభూతి పరులు పేర్కొంటున్నారు. పోలీసు రికార్డులకెక్కిన మావోయిస్టుల్లో దండకారణ్యంలో పనిచేస్తున్న వారు తప్పా ప్రస్తుతం భౌతికంగా ఏ ఒక్కరు లేనట్లుగా చెబుతున్నారు. ఈక్రమంలో నాలుగు న్నర దశాబ్దాల పోరాట వారసత్వం కలిగిన ఉమ్మడి జిల్లా విప్లవ ప్రస్థానం ఇక చరిత్ర పుటలకు పరిమితం కానుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కొత్తగా మావోయిస్టు పార్టీలో రిక్రూట్‌మెంట్ నిలిచి పోవడంతో ఉద్యమ ఉనికి ప్రశ్నార్థకంగా మారింది.

ఉద్యోగ వేట ఇక సులభతరం

- నిరుద్యోగుల కోసం ‘డీట్’ యాప్‌ను ఏర్పాటు చేసిన ప్రభుత్వం

బోథ్: డిజిటల్ యుగంలో నిరుద్యోగులకు ఉ ద్యోగావకాశాలు కల్పించాలనే లక్ష్యంతో తెలం గాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక సాంకేతికతతో కూడిన ‘డీట్’ (డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎకే స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ) యాప్‌ను అందుబాటు లోకి తెచ్చింది. నిరుద్యోగులు, ప్రైవేటు రంగ సంస్థల మధ్య ప్రత్యక్ష వారధిగా ఈ యాప్ పనిచేయనుంది.

పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో పర్యవేక్షణ

పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఈ డిజిటల్ ప్లాట్ ఫామ్‌ను రూపొందించారు. విద్యా సంస్థలు, ప్ర భుత్వ శాఖలు, ప్రైవేటు సంస్థల సమన్వయం తో ఇది పర్యవేక్షించబడుతుంది. తద్వారా, అ భ్యర్థులు తమ అర్హతలకు తగిన ప్రైవేటు రంగ ఉద్యోగ అవకాశాలను సులభంగా పొందేందు కు మార్గం సుగమం అవుతుంది. పరిశ్రమలు, నిరుద్యోగులు ఈ యాప్‌లో నమోదు చేసుకుం టే కంపెనీలు తమకు అవసరమైన, స్కిల్ ఉన్న వారికి సందేశాన్ని పంపిస్తారు. వందల కంపె నీలన్నీ ఒకే చోట ఉండటంతో నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉటుంది.

అర్హతలు, నైపుణ్యాల ఆధారంగా ఉద్యోగాలు

డీట్ యాప్ ద్వారా పదో తరగతి, ఐటీఐ, ఇం టర్, డిప్లొమా, డిగ్రీ, ఆపై చదివిన అభ్యర్థులు ప్రయోజనం పొందవచ్చు. వారి విద్యార్హత, నైపుణ్యాలు, అనుభవం ఆధారంగా కంపెనీలు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ఈ వేదిక ఉపయోగపడుతుంది. డిగ్రీ చదువుతున్న అభ్య ర్థులకు కూడా నమోదు చేసుకునే అవకాశం కల్పించడం అదనపు విశేషం. ఫార్మా, ఇండస్ట్రి యల్, బీపీవో, కస్టమర్ ఎగ్జిక్యూటివ్ సపోర్ట్,



డీట్ వెబ్‌సైట్

బిజినెస్ డెవలప్‌మెంట్, సేల్స్ ఎగ్జిక్యూటివ్‌తో పాటు అనేక ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయి.

- నిరుద్యోగులు, ఉద్యోగాలు కల్పించే ఔత్సా హిక కంపెనీలు ఈ యాప్‌లో నమోదు చేసు కోవచ్చు.
- కంపెనీ నిర్వాహకులు, యాప్‌లో నమోదైన అభ్యర్థుల విద్య, నైపుణ్య వివరాలను పరిశీలిం చి, నేరుగా వారిని సంప్రదిస్తారు.
- కంపెనీల నియమావళిని బట్టి రాత లేదా మౌఖిక పరీక్షలు నిర్వహించి అభ్యర్థులను ఎం పిక చేసుకుంటారు. ఎలాంటి మధ్యవర్తుల ప్రమేయానికి ఇందులో అవకాశం ఉండదు.

నమోదు విధానం

- నిరుద్యోగులు తమ పూర్తి వివరాలను డీట్ యాప్‌లో లేదా అధికారిక వెబ్‌సైట్ www.deet.telangana.gov.in లో నమోదు చేసు కోవాల్సి ఉంటుంది.
- ఫోన్ నంబర్‌కు వచ్చే ఓటీపీ ద్వారా యాప్‌ను తెరవాలి.
- విద్యార్హతలు, సాంకేతిక నైపుణ్యాలు, అను భవం, ఇంటర్న్‌షిప్‌ల వివరాలు నమోదు చేయాలి.
- పార్ట్‌టైమ్, ఫుల్‌టైమ్, అప్రెంటిస్‌షిప్‌లలో దేని కోసం అన్వేషిస్తున్నారో, ఏ రంగంలో ఉద్యోగం కావాలో స్పష్టం చేయాలి.
- విద్యార్హత పత్రాలను యాప్‌లో అప్‌లోడ్ చేయడంతో నమోదు ప్రక్రియ పూర్తవుతుంది.

భార్యను కడతేర్చిన భర్త

- మద్యం తాగొద్దని మందలించిందని గొడ్డలితో నరికి హత్య
- ఆదిలాబాద్ జిల్లా సీతాగోందిలో ఘటన


రక్తపు మడుగులో సిడాం లక్ష్మీబాయి


గుడిహత్నూర్: మద్యం తాగొద్దని మందలించిన భార్యను గొడ్డలితో నరికి చంపిన సంఘటన మండ లంలో సంచలనం సృష్టించింది. పోలీసులు తెలి పిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సీతాగోంది గ్రామానికి చెందిన సిడాం సంతోష్, లక్ష్మీబాయి (35) దంపతులు కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. సంతోష్ మద్యానికి బానిసై తరచూ ఇంట్లో భార్యతో గొడవపడేవా డు. గురు వారం ఉదయం సైతం మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. తాగి మోటార్ సైకిల్ నడుపొద్దని లక్ష్మీబాయి మందలించింది. మద్యం మత్తులో ఉన్న సం తోష్ కోపంతో ఇంట్లో ఉన్న గొడ్డలితో ఆమె చెంప భాగంలో బలంగా కొట్టడం తో సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయింది. నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తన భార్యను హత్య చేశానని పోలీసులకు లొంగిపోయాడు. సీఐ బండారి రాజు, ఎస్సై శ్రీకాంత్ సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య


మాధవి (ఫైల్)

బాసర: ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకున్న సం ఘటన మండలంలో చోటు చేసుకుంది. సీఐ సాయికు మార్ తెలిపిన వివరాల మేరకు మహారాష్ట్రలోని హాజిని గ్రామానికి చెందిన మాధవి (23)కి బాసర మండలం లోని దొడాపూర్ గ్రామానికి చెందిన కర్మానే మనోజ్‌తో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. ప్రస్తుతం వారికి ఇద్దరు పిల్లలు సంతానం. కొంతకాలంగా మనోజ్ మద్యం సేవించి ఇంటికి వచ్చి అద నపు కట్నం తేవాలని మా ధవిని మానసికంగా, శారీరకంగా ఇబ్బందులకు గురిచేసేవా డు. దీంతో మనస్తాపానికి గు రైన మహిళ బుధవారం రాత్రి ఇం ట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భర్త వేధింపులతో నే తమ కుమార్తె ఆత్మహత్య చేసుకుందని మృతురా లి తండ్రి రాంచందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

కడెం ప్రాజెక్ట్ గేటు ఎత్తివేత


కడెం ప్రాజెక్ట్

కడెం: కడెం ప్రాజెక్ట్‌కు గురువారం రాత్రి 1000 క్యూసెక్కుల స్వల్ప ఇన్‌ఫ్లో రావడంతో ఇరిగే షన్ అధికారులు ఒక వరద గేటు ఎత్తి 4,178 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ఇన్‌ఫ్లో పెరిగితే మరిన్ని గేట్లు ఎత్తనున్నట్లు అధికారులు వెల్లడించారు.

నిజాయతీ చాటుకున్న సాయితేజ


బ్యాగును అప్పగిస్తున్న పోలీసులు

లోకేశ్వరం: మండలంలోని పుస్పూర్ గ్రామా నికి చెందిన గొడిసెల సాయితేజగౌడ్ దొరికిన బ్యాగును లోకేశ్వరం పోలీసులకు అప్పగించి నిజాయతీ చాటుకున్నాడు. బుధవారం నిజా మాబాద్ నుంచి పుస్పూర్‌కు బైక్‌పై వస్తున్న సాయితేజకు నందిపేట్ మండలం పలుగుగు ట్ట సమీపంలో ఓ హ్యాండ్‌బ్యాగు దొరికింది. అందులో సెల్‌ఫోన్, రెండు గ్రాముల బంగా రం, ఆధార్ కార్డు ఉంది. ఆధార్ ఆధారంగా నందిపేట్ మండల కేంద్రానికి చెందిన ప్రవళిక గా గుర్తించి లోకేశ్వరం పోలీసులకు బ్యాగ్‌ను అప్పగించాడు. సుమారు రూ.40 వేల విలువైన వస్తువులను అప్పగించిన యువకుడిని పోలీసు లు అభినందించారు. గురువారం పోలీసులు బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం అం దించి బ్యాగును అప్పగించారు.

డబ్బులు దండుకున్న మధ్యవర్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: మధ్యవర్తిగా వ్యవహరిస్తూ కోర్టులో తీర్పు అనుకూలంగా వచ్చేలా చూస్తా నని, పెద్దల సమక్షంలో సెటిల్‌మెంట్ చేస్తానని డబ్బులు వసూలు చేసిన నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కె.నాగరాజు తెలిపారు. హైకోర్టులో జడ్జీలు, న్యాయవాదు లు పరిచయం ఉన్నారని నమ్మబలికి బాధితుల నుంచి రూ.3 లక్షల 50వేలు వసూలు చేసినట్లు పేర్కొన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఖుర్షీద్ నగర్‌కు చెందిన ఫిర్యాదుదారు కుమారుడు, కోడలు మధ్య గొడవలు ఉన్నాయి. మధ్యవ ర్తిగా పరిచయం ఉన్న జైనూర్ మండలంలోని బూసిమెట్టకు చెందిన జాడే రవీందర్ బాధితు లను నమ్మబలికి అందినకాడికి దండుకున్నా డు. తీసుకున్న డబ్బులు ఇవ్వకుండా తిప్పుకుం టున్నాడు. మొదట రూ.3లక్షలు ఇవ్వగా ఆ త ర్వాత కేసు నమోదు చేయిస్తానని బెదిరించి మ రో రూ.50 వేలు తీసుకున్నాడు. డబ్బులు అడి గితే బెదిరింపులకు పాల్పడడంతో బాధితురా లు గురువారం ఫిర్యాదు చేయగా కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

42 కిలోల గంజాయి దహనం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో నమోదైన 18 కేసు ల్లో పట్టుబడిన 42 కిలోల గంజాయిని గం జాయి డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో దహనం చేశారు. నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లిలోని శ్రీ మెడికేర్ సర్వీసెస్ సెంటర్‌లో గురువారం గం జాయి డిస్పోజల్ చేశారు. ఇందులో 22 కిలోల గంజాయి మొక్కలు, 20 కిలోల ఎండు గం జాయిని దహనం చేశారు. అడిషనల్ ఎస్పీ సు రేందర్ రావు, డీసీఆర్‌బీ సీఐ హకీమ్ ఈ ప్రక్రి యను పరిశీలించారు.

హోరాహోరీగా బ్యాడ్మింటన్ పోటీలు

మంచిర్యాలఅర్బన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వ ర్యంలో మంచిర్యాల క్లబ్‌లో గురువారం నిర్వహిం చిన అండర్–14, 17, 19 బాలబాలికల జోనల్ స్థాయి ఎంపిక పోటీలు హోరాహోరీగా సాగాయి. బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముఖేష్‌గౌడ్ పోటీలను ప్రారంభించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి 120 మంది క్రీడాకారులు పాల్గొనగా ఒక్కో గ్రూపు నుంచి ఐదుగురు చొప్పున 30 మంది ఎంపికయ్యారు. అండర్–14 హైదరాబాద్, అండర్ –17 మేడ్చల్, అండర్–19 మహబూబాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి యాకూబ్ తెలిపారు. కార్యక్రమం లో అండర్–19 ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బాబురావు,


క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న ముఖేష్‌గౌడ్

బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి పులూరి సుధాకర్, జెడ్పీబాలుర ఉన్నత పాఠశాల ప్రధా నోపాధ్యాయుడు బండి రమేశ్, ఫిజికల్ డైరెక్టర్ రేణి రాజయ్య, కుమురంభీం జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

గెలిచిన సంఘాలు విఫలం

- సీఐటీయూ అధ్యక్షుడు టీ.రాజారెడ్డి

శ్రీరాంపూర్: కార్మికుల సమస్యలు పరిష్కరించడం లో గెలిచిన సంఘాలు విఫలమయ్యాయని సీఐటీయూ కేంద్ర కమిటీ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి ఆరోపించారు. గురువారం ఆర్కే 7 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. సింగరే ణిలో మెడికల్ బోర్డు నిర్వహించడం లేదని, ఇన్వా లిడేషన్ అయిన వారి స్థానంలో డిపెండెంట్లకు కారు ణ్య ఉద్యోగాలు ఇవ్వడం లేదన్నారు. కార్మికుల సమస్యలపై కొట్లాడటానికి వేదికలైన స్ట్రక్చర్ సమా వేశాలు బహిష్కరించి ఇక్కడ గనులపై మెమోరాం డాలు ఇస్తూ కార్మికులను అయోమయానికి గురి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆ యూని యన్ బ్రాంచి అధ్యక్షుడు గుల్ల బాలాజీ, రాష్ట్ర కమిటీ సభ్యుడు కస్తూరి చంద్రశేఖర్, నాయకులు వెంగళ కుమారస్వామి, వెంకట్‌రెడ్డి, సమ్మయ్య, ప్రవీణ్, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాజారెడ్డి

లక్ష్మీదేవర ఆలయంలో చోరీ

భీమారం: మండల కేంద్రంలోని లక్ష్మీదేవర ఆల యంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. ముది రాజ్ సంఘం పెద్దలు తెలిపిన వివరాలు ఇలా ఉ న్నాయి.. సమీపంలోని పత్తి చేను మీదుగావచ్చిన దుండగులు మొదట ఆలయం తలుపులు పగుల గొట్టి లోనికి ప్రవేశించారు. హుండీలో ఉన్న 4 కిలో ల 500గ్రాములు వెండి, రూ. 36 వేల నగదు, అ మ్మవారిపై ఉన్న రెండు తులాల బంగారు ఆభరణా లను ఎత్తుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి ద ర్యాప్తు చేస్తున్నారు. ఆలయంలో ఇంత పెద్దఎ త్తున వెండి ఉందన్న సమాచారం దొంగలకు ఎలా చేరిం దని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

మందు పార్టీ చేసుకుని దోపిడీ

చోరీకి పాల్పడిన దొంగలు మొదట సమీపంలోని పత్తి చేనులో మందు పార్టీ చేసుకున్నట్లు ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. పథకం ప్రకారం మొదట ఆలయ పరిసర ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించినట్లు తెలుస్తోం ది. ఆలయం ఎదుటే నివాస గృహాలు ఉన్నప్పటికీ దుండగులు దోచుకుని యధేచ్ఛగా వెళ్లి పోవడం వెనుక స్థానికులు ఎవరైనా వారికి సహకరించారా? అనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు.


ఆలయంలో పరిశీలిస్తున్న సీఐ వేణుచందర్

500 మీటర్ల దూరంలోనే పోలీస్‌స్టేషన్

పోలీస్‌స్టేషన్‌కు కేవలం 500 మీటర్ల దూరంలోనే చోరీ, జాతీయ రహదారికి సమీపంలోనే చోరీ జర గడం మండలంలో సంచలనంగా మారింది.

సంఘటన స్థలాన్ని పరిశీలించిన సీఐ

సంఘటన స్థలాన్ని శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ గురువారం సందర్శించి స్థానికులను అడిగి వివరా లు తెలుసుకున్నారు. డాగ్‌స్క్వాడ్‌తో పరిసరాలు గా లించగా అది పత్తిచేనులోకి వెళ్లి ఆగిపోయింది. నిం దితులను త్వరలోనే పట్టుకుంటామన్నారు.

ట్రయల్ పేరిట బైక్..

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని భుక్తాపూర్‌కు చెం దిన సయ్యద్ రఫీక్ అటో కన్సల్టెన్సీ టూవీలర్ పర్చేజ్ అండ్ సేల్స్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. బుధవారం బైక్ కొనుగోలు చేసేందుకు వచ్చిన ఓ వ్యక్తి ట్రయల్ కోసం బండిని కొంతదూరం వరకు తీసుకెళ్లి తిరిగి రాలేదు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు.

పశువులను తరలిస్తున్న లారీ పట్టివేత


పట్టుబడిన లారీతో పోలీసులు


మృతి చెందిన పశువులు

బోథ్: మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నుంచి హైద రాబాద్‌కు పశువులను తరలిస్తున్న లారీని గురు వారం సోనాల మండలంలోని ఘన్‌పూర్ చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. తమకు అందిన సమాచారం మేరకు పోలీసులు ఘన్‌పూర్ చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు నిర్వహించగా అనుమానాస్పదంగా ఉన్న లారీని ఆపి పరిశీలించగా అందులో పశువులు కనిపించాయి. లారీలో 26 పశువులు ఉండగా రెం డు మృతి చెంది ఉన్నాయి. వాహనాన్ని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పట్టుకున్న పశువులను బజార్ హత్నూర్‌లోని గోశాలకు తరలించినట్లు ఎస్సై శ్రీసాయి పేర్కొన్నారు. లారీ ఓనర్‌తో పాటు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరు..


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏఎస్సై అన్వర్

లక్సెట్టిపేట: మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుం ది. ఎస్సై గోపతి సురేశ్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని ఎల్లారం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ వావిలాల రమేశ్ (39) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. బుధవారం మంచిర్యా లకు వెళ్లి అతిగా మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. మద్యం మత్తులో ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకున్నాడు. మృతుని భార్య రజిని ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి


బుచ్చన్న (ఫైల్)

లక్ష్మణచాంద: పురుగుల మందు తాగి ఒకరు ఆత్మ హత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని ఒడ్డెపెల్లి గ్రామానికి చెందిన పల్లపు బుచ్చన్న (52) కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. దీంతో మనస్తా పానికి గురై ఈ నెల 13న గుర్తుతెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలిం చారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ షాక్‌తో గుర్తు తెలియని వ్యక్తి ..


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

నేరడిగొండ: మండలంలోని బుద్దికొండ గ్రామ స మీపంలో స్థానిక రైతు నవీన్ రెడ్డికి చెందిన వ్యవ సాయ క్షేత్రంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి (45) విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు ఎస్సై ఇమ్రాన్ ఖాన్ తెలిపారు. గ్రామస్తులు సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించినట్లు తెలిపారు. మృతుడు తెల్లటి చొక్కా, జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నట్లు తెలి పాడు. కేసు దర్యాప్తు చేస్తు న్నట్లు వివరించారు. వివరాలు తెలిసిన వారు 8712659947 నంబర్‌కు సమాచారం అందిం చాలని కోరారు.

వేర్వేరు చోట్ల ఇద్దరికి పాము కాటు

బేల: మండలంలోని సిర్సన్న, జూనోని రెవెన్యూ గ్రామ శివారుల్లోని పొలాల్లో గురువారం ఇద్దరు రైతులు పాముకాటుకు గురయ్యారు. సిర్సన్న గ్రా మ శివారులోని పొలంలో పనిచేస్తున్న బబన్‌కు, జూనోని గ్రామ శివారులోని పొలంలో పనిచేస్తున్న వైశాలిని వేర్వేరుగా పాములు కాటేశాయి. గమనిం చిన స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో ఈఎంటీ అనిల్, పైలెట్ అర్షద్‌ఖాన్ బాధితులకు ప్రథమ చికిత్స అందిం చారు. మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రంలో ని రిమ్స్‌కు తరలించారు.


వైశాలికి చికిత్స చేస్తున్న ఈఎంటీ అనిల్